

## ఘనంగా శోభాయాత్ర

అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో సోమవారం జిల్లాలోని పలు గ్రామాలలో మహా శోభాయాత్ర నిర్వహించారు.

- 9లో ▸



## వాహనదారులకు భద్రతేదీ?

పద్మాజీవాడి చౌరస్తాలో హైవేపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

- 8లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.7 /11.5

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

## న్యూస్‌రీల్

### 28న అండర్-14, 16 అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 28న ఉదయం 8గంటలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. అండర్-14, 16 బాలబాలికల జిల్లాస్థాయి జాతీయ ఇంటర్ డిస్ట్రిక్స్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, ట్రయాథ్లాన్ అంశాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం తీసుకుని, స్పోర్ట్స్ యూనిఫాం విత్ షూస్ ధరించి ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

### ద్విపదగీత పుస్తకావిష్కరణ



నిజామాబాద్ సిటీ: నగరంలోని లలితాశ్రమాలయంలో సోమవారం యశస్విని సాహితీ సమితి ఆధ్వర్యంలో తంగుడిగె ఫణీంద్ర రచించిన మూడు పద్య పుస్తకాలు, కీర్తిశేషులు తంగుడిగె శ్రీధర్ రావు రాసిన ద్విపదగీత పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నటేశ్వరశర్మ పాల్గొని మాట్లాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన పద్యం నిత్యం వర్ధిల్లాలన్నారు. శాస్త్ర పాండిత్యం ఉన్నవారే అసలైన కవిత్వాన్ని రాయగలుగుతారని, అలాంటి వారే కవులుగా నిలబడుతారన్నారు. ఆ వరుసలోనే ఫణీంద్ర గణిత శాస్త్ర ఆచార్యులుగా రాణిస్తూనే పద్యకావ్యాలు రాయడం గొప్ప విషయమన్నారు. కవి తల్లి తంగుడిగె గంగాదేవి, కవి దంపతులను సన్మానించారు. కొరిడె విశ్వనాథశర్మ, తల్లావజ్జల మహేశ్ బాబు, చిత్కళ శ్రీనివాసశర్మ, కాసర్ల నరేశ్‌రావు, యస్ సాయిప్రసాద్, తంగుడిగె శ్రీనివాసరావు, సరస్వతీరామశర్మ తదితరులు పాల్గొన్నారు.

### కాకతీయ కాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా సోమవారం ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను పెంచారు. వారబందీ ప్రకారం కాకతీయ కాలువ ఆయకట్టు జోన్ -2 కు నీటి సరఫరా కోసం 5500 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 50, అలీసాగర్ లిఫ్టు ద్వారా 180, గుత్ప లిఫ్టు ద్వారా 150 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1087.80(75.78 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

# ఖాకీకి 'మత్తు' మరక!

**ఆబ్కారీ శాఖ పరువు డ్రగ్స్ పాలయ్యింది.** ఖాకీ చొక్కాకు 'మత్తు' మరక అంటింది. మత్తు పదార్థాల అక్రమ దందాను అడ్డుకోవాల్సినవారే.. ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తేలడంతో అందరూ అవాక్కవుతున్నారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్ అరెస్టు కావడం, ఈ దందాలో మరికొందరి ప్రమేయం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో ఆబ్కారీ శాఖలో ఏం జరుగుతుందోనన్న అంశంపై చర్చ జరుగుతోంది.

– సాక్షి, కామారెడ్డి




- ఆబ్కారీ పరువు.. డ్రగ్స్ పాలు
- అల్ప్రాజోలం అక్రమ దందాలో ఎక్సైజ్ కానిస్టేబుల్ అరెస్ట్
- మరికొందరి ప్రమేయంపై ఆరా తీస్తున్న నార్కోటిక్స్ పోలీసులు

కామారెడ్డి జిల్లా మత్తు పదార్థాల దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దశాబ్దాల కాలంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు మత్తు పదార్థాల దందా చేస్తూ అడ్డగోలుగా సంపాదించారు. వారిని చూసి మరికొందరు ఈ అక్రమ దందాలో అడుగుపెట్టారు. గతంలో పెద్ద ఎత్తున మత్తు దందా సాగించిన వారు మానేసినట్టు నటిస్తూనే, బినామీలతో దందా నడిపిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట తదితర మండలాలకు చెందిన పలువురికి ఈ దందాతో సంబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**పోలీసులకు చిక్కిన ముఠా**

రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ అక్రమ దందాను కట్టడి చేయడంకోసం నార్కోటిక్స్ విభాగాన్ని బలోపేతం చేస్తోంది. సర్కారు ఆదేశాలతో పోలీసు శాఖ సైతం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో కల్లులో కలిపే అల్ప్రాజోలం మత్తు పదార్థాల దందా చేస్తున్న ముఠా పోలీసులకు చిక్కింది. ఈ ముఠాలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రమేశ్‌తోపాటు జిల్లాకు చెందిన మరో ఇద్దరు మత్తు వ్యాపారులు ఉన్నారు. వీరిని నాలుగు రోజులుగా హైదరాబాద్‌కు చెందిన నార్కోటిక్స్ విభాగం పోలీసులు విచారిస్తున్నారు.

### కొనసాగుతున్న విచారణ..

ఆబ్కారీ శాఖలో మామూళ్లు తీసుకోవడం మామూలే అన్న ప్రచారం ఉంది. అయితే ఏకంగా ఓ కానిస్టేబులే మత్తు పదార్థాల దందా చేస్తూ పోలీసులకు చిక్కడంతో ఆ శాఖ పరువు బజారున పడినట్టయ్యింది. అల్ప్రాజోలం దందా చేస్తూ ఎక్సైజ్ కానిస్టేబుల్ చిక్కడంతో పోలీసులు నివ్వెరపోయారు. మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయన్న దానిపై ఆరా తీస్తున్నారు. చిక్కిన ముఠా ద్వారా దందాలో ఇంకెవరెవరు ఉన్నారన్న దానిపై విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ శాఖకు చెందిన మరికొందరు పోలీసు కానిస్టేబుళ్ల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో మత్తు దందాకు సంబంధించి రాకెట్‌ను ఛేదించేందుకు విచారణ ముమ్మరం చేశారు.

### ఎక్సైజ్ కానిస్టేబుల్‌దే ప్రధాన పాత్ర..

కామారెడ్డికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్ మత్తు దందాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు తెలంగాణ రాష్ట్రానికి వివిధ మార్గాల ద్వారా చేరుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వివిధ మార్గాల ద్వారా తన వద్దకు వచ్చిన మత్తు పదార్థాలను కానిస్టేబుల్ రమేశ్ పలువురికి చేరవేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఇక్కడినుంచే రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి తదితర జిల్లాలకు అల్ప్రాజోలం సరఫరా అవుతున్నట్టు భావిస్తున్నారు.

# ఘనంగా క్రిస్మస్



జిల్లా కేంద్రంలో వెస్లీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్ తదితరులు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు
- సందేశాలు వినిపించిన పాస్టర్లు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్‌లు, పాస్టర్లు ఏసు సందేశాలను వినిపించారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ వెస్లీ చర్చితోపాటు పలు చర్చిలలో సందడి నెలకొంది.

# బీఆర్ఎస్‌కు షాక్

- కామారెడ్డి బల్దియాలో పార్టీని వీడుతున్న కౌన్సిలర్లు
- తాజాగా కాంగ్రెస్‌లో మరో ఇద్దరి చేరిక



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్లు మమత, అస్మా అఫ్రీన్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. నాలుగో వార్డు కౌన్సిలర్ పిడుగు మమత, 29వ వార్డు కౌన్సిలర్ అస్మా అఫ్రీన్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరిద్దరు సోమవారం కామారెడ్డిలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా వీరిద్దరు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచినవారే కావడం గమనార్హం. ఎన్నికల అనంతరం గులాబీ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం సొంత గూటికి చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు మహమ్మద్ ఇసాక్ షేరు, చాట్ల వంశీ, నాయకులు అంజాద్, సాయిబాబా, ఐరేని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**హస్తం వైపు మరికొందరి చూపు..**

కామారెడ్డి బల్దియాలో 49 వార్డులుండగా.. 2019లో జరిగిన ఎన్నికల్లో 12 మంది కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. తర్వాత ఒక్కరొక్కరుగా ఎనిమిది మంది కాంగ్రెస్‌ను వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బల్దియా వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియతో పాటు 16వ వార్డు కౌన్సిలర్ చాట్ల వంశి కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత 19, 28వ వార్డుల బీఆర్ఎస్ కౌన్సిలర్లు చింతల రవీందర్‌గౌడ్, మామిండ్ల రమేష్ వీరిని అనుసరించారు. సోమవారం మరో ఇద్దరు కాంగ్రెస్‌లో చేరడంతో బల్దియాలో ఆ పార్టీ బలం 10కి చేరింది. మరో 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌లో ఇంకా 33 మంది కౌన్సిలర్లున్నారు. ఇందులో కొందరు హస్తం గూటికి చేరితే ఆ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

# నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రితో సమావేశం



కామారెడ్డి క్రైం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిజామాబాద్ రానున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిజామాబాద్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో ఇన్‌చార్జి మంత్రి సమావేశమై ప్రజాపాలన గ్రామ సభలపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులవారీగా నియమితులైన ప్రత్యేకాధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

**దరఖాస్తుల స్వీకరణకు సిద్ధంగా ఉండండి**

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుందని కలెక్టర్ పాటిల్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు అధికారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైనవారికి దశల వారీగా సంక్షేమ పథకాలను అందించడంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కోసం ఒకరోజు ముందు ఆయా గ్రామాలు, వార్డులలో చాటింపు వేయించాలని, సోషల్ మీడియాలోనూ ప్రచారం చేయాలని సూచించారు.

# గ్రామీణుల ముంగిట్లోకి కేంద్ర పథకాలు

- ప్రతి ఇంటికి చేరేలా అధికారులు కృషి చేయాలి
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



సిర్‌పూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్‌రూరల్: వివిధ వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి వస్తున్నాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గ్రామగ్రామాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందన్నారు. సోమవారం మోపాల్ మండలం సిర్‌పూర్‌లో నిర్వహించిన యాత్రలో ఎంపీ మాట్లాడారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలనే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే వీటి ద్వారా ఎంతో మంది లబ్ధి పొందుతున్నారని గుర్తుచేశారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారు సభలో తమ అనుభవాలను తెలిపారు. పథకాలను వినియోగించుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఎంపీ ఆరా తీయగా.. అలాంటిదేమీ లేదని లబ్ధిదారులు సమాధానమిచ్చారు. ఆయా పథకాల కోసం అర్హులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీ సూచించారు. ప్రస్తుత యాత్ర ద్వారా మీ వద్దకు వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. డ్రోన్ ద్వారా నానో యూరియాను పొలంలో పిచికారీ చేసే విధానాన్ని అధికారులు ప్రయోగాత్మకంగా వివరించగా.. ఎంపీ అర్వింద్ ఆసక్తిగా తిలకించారు. కేంద్ర పథకాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దినేశ్ కులాచారి, సర్పంచ్ సామముత్యం, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

# ఆర్టీసీకి అదనంగా రెండు వేల బస్సులు



ఆర్మూర్ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- సంస్థ ఆస్తులను దుర్వినియోగం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు
- మహాలక్ష్మి పథకానికి మంచి స్పందన
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్మూర్: తెలంగాణ ఆర్టీసీకి అదనంగా రెండు వేల బస్సులను సమకూర్చనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేబినేట్‌లో ఈ మేరకు చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ వెళ్లా మార్గమధ్యలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుంటున్న మహిళ ప్రయాణికులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తుందన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని తమ నాయకురాలు సోనియాగాంధి జన్మదినం రోజున ప్రారంభించామన్నారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు సుమారు నాలుగు కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో బస్టాండ్‌లలో వ్యాపారాలతో పాటు దేవాలయాలు, ఇతర అనుబంధ సంస్థల్లో ఆదాయం పెరిగిందన్నారు. ఆర్టీసీకి ఉచిత ప్రయాణం భారం కాకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుందన్నారు. ఏఏ రూట్లలో బస్సులు లేవో ఆ రూట్లలో బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ఆస్తులను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానికి ఉందంటూ ఆర్టీసీ ఆస్తులను దుర్వినియోగం చేస్తే, కబ్జాలకు పాల్పడితే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకొనే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఈనెల 28 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులకు సూచించారు.

# సమరానికి సన్నద్ధం

**రాజకీయ పార్టీలు మరో సమరానికి సన్నద్ధమవుతున్నాయి.** పార్లమెంట్ ఎన్నికలకోసం కసరత్తు చేస్తున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో మూడు ప్రధాన పార్టీలకు ప్రాతినిధ్యం ఉండడం, అన్ని పార్టీలు గణనీయంగా ఓట్లు సాధించడంతో పార్లమెంట్ ఎన్నికలు రసవత్తరంగా సాగే అవకాశాలున్నాయి.

– సాక్షి, కామారెడ్డి

- లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు చేస్తున్న పార్టీలు
- రాష్ట్రంలో గెలుపుతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- ఓటమితో కసిగా ఉన్న బీఆర్ఎస్
- మోదీ చరిష్మా, రామమందిరం అంశాలపై బీజేపీ ఆశలు



జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కామారెడ్డి జిల్లాకు సంబంధించి కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలు, సంగారెడ్డి జిల్లాలోని అందోల్, నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్ అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. నాలుగు చోట్ల కాంగ్రెస్ పార్టీ, రెండు చోట్ల బీఆర్ఎస్, ఒకచోట బీజేపీ విజయం సాధించాయి. రాష్ట్రంలో మెజారిటీ స్థానాలు గెలుచుకుని అధికారం 'హస్త'గతం చేసుకుని జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎలాగైనా జహీరాబాద్ పార్లమెంట్ సీటును కైవసం చేసుకోవాలన్న ఆరాటంతో ఉంది. పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని నియమించింది. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించి చరిత్ర సృష్టించిన బీజేపీ.. అదే ఊపుతో ప్రధాని మోదీ చరిష్మా, అయోధ్యలో రామ మందిర నిర్మాణం నినాదాలతో ఎన్నికల బరిలో దిగేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే నిర్మల్, నిజామాబాద్‌లలో నిర్వహించిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన చర్చ జరిగింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో అనుసరించిన వ్యూహాలపై బీజేపీ జాతీయ నాయకుడు సునీల్ బన్సల్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రంలో వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. మూడోసారి ఎన్నికలలో బోల్తాపడింది. అయితే జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కొన్ని సీట్లను తక్కువ ఓట్లతో కోల్పోయింది. కొంచెం కష్టపడితే కామారెడ్డి, జుక్కల్ సీట్లు గెలిచేవారమన్న భావన ఆ పార్టీ వర్గాలలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలలో సత్తా చాటాలని గులాబీ దళం ఆరాటపడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కసిగా ఉన్న ఆ పార్టీ మెజారిటీ ఎంపీలను గెలుచుకోవడం కోసం పార్లమెంటు నియోజక వర్గాల వారీగా నేతలతో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తోంది.

### కాంగ్రెస్ నుంచి షెట్కార్!?

జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఆయన 2004లో నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 2009లో జహీరాబాద్ ఎంపీగా గెలిచిన ఆయన 2014లో ఓటమి పాలయ్యారు. 2019లో ఆయన పోటీ చేయలేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధమైన ఆయనకు పార్టీ టికెట్టు వచ్చినట్లే వచ్చి చివరి నిమిషంలో చేజారింది. ఎంపీగా అవకాశం ఇస్తామని అధిష్టానం సముదాయించడంతో ఆయన వెనక్కి తగ్గారు. రాష్ట్రంలో అధికారం వచ్చిన నేపథ్యంలో ఎంపీగా బరిలో నిలిచి గెలవాలని ఆయన ఆరాటపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు.

### బీజేపీలో పోటాపోటీ...

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఉన్న బీజేపీలో జహీరాబాద్ ఎంపీ టికెట్టు కోసం పోటీ నెలకొంది. మోదీ హవాతో పాటు అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో బీజేపీ టికెట్టుకు డిమాండ్ పెరిగింది. ఇక్కడినుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డి జిల్లాకు సంబంధించి ప్రముఖ సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నుంచి పోటీ చేసి ఓడిపోయిన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, మరో నాయకుడు మురళీధర్‌గౌడ్ టికెట్టు ఆశిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ ఎంపీ బాగారెడ్డి కుమారుడు జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీ ఆలె నరేంద్ర తనయుడు భాస్కర్ కూడా టికెట్టు రేసులో ఉన్నారు. వీరితో పాటు మరికొందరు కూడా బీజేపీ అభ్యర్థిత్వం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

### బీఆర్ఎస్‌లో ఎవరో?

రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచిన బీబీ పాటిల్ ఈసారి బరిలో నిలిచేందుకు రెడీ అవుతున్నారు. అయితే 2019 ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో బయటపడిన ఆయన నియోజకవర్గంలో పర్యటించడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యేలు ఆయనను చాలా కార్యక్రమాలకు ఆహ్వానించలేదు. వారిని కాదని తిరగలేని పరిస్థితుల్లో ఆయన సంగారెడ్డి జిల్లాలోనే ఎక్కువ సమయం వెచ్చించారు. కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావులకు అత్యంత సన్నిహితుడైన పాటిల్‌కు తిరిగి టికెట్టు వస్తుందని ఆయన అనుచరులు అంటున్నారు. అయితే జనగామకు చెందిన వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి ఎంపీ టికెట్టు కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. బీబీపేటలో సొంత డబ్బులతో ఆధునిక హంగులతో ప్రభుత్వ పాఠశాలను నిర్మించడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సుభాష్‌రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయన ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

## క్లుప్తంగా

### పేరిణి నృత్యంలో ఉచిత శిక్షణ

నిజామాబాద్ సిటీ: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, భీమన్ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో ఉచిత పేరిణి నృత్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేరిణి అన్నెలదేవి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి నుంచి ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.1200 చెల్లించి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇందులో పురుషులకు తాండవం, స్త్రీలకు లాస్యం నేర్పుతామని పేర్కొన్నారు. పదేళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు.

### యూనివర్సిటీ నేషనల్ హాకీ పోటీలకు ఎంపిక



సిరికొండ: యూనివర్సిటీ నేషనల్ హాకీ పోటీలకు తూంపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు ఎంపికైనట్లు జెడ్పీహెచ్ఎస్ పీఈటీ నాగేష్ సోమవారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన సెలక్షన్స్‌లో హైద్రాబాద్ జీసీపీఈ కాలేజీలో వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణలో ఉన్న హాకీ క్రీడాకారులు కె గిరిచరణ్, ఎల్ వినోద్, ఆర్ సృజన్ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. తమిళనాడులో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే యూనివర్సిటీ నేషనల్ హాకీ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వారిని సర్పంచ్ బాలమణిమల్లేష్, ఎంపీటీసీ లింగం, గ్రామస్తులు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణ అభినందించారు.

### ఖోఖో జాతీయ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



కామారెడ్డి అర్బన్: ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరగనున్న జాతీయ ఖోఖో పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తరలివెళ్లినట్లు ఖోఖో ఉమ్మడి జిల్లా అసోయేషన్ ప్రధాన కార్యదర్శి అతికుల్లా తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న మణికంఠ, గౌతమ్, జీవన్‌దాస్, మైథిలి, శ్రీవర్ష, నిహారికను అసోసియేషన్ ప్రతినిధులు ఎన్ మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వరరావు, నీలరాజు అభినందించారు.

### రాష్ట్రస్థాయి సైక్లింగ్‌లో బంగారు పతకం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన శిల్పాచౌహాన్ రెండు బంగారు పతకాలు సాధించింది. ఈ నెల 22 నుంచి 24 వరకు సిద్దిపేట జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి రోడ్ సైక్లింగ్‌లో శిల్పాచౌహాన్‌కు టైం ట్రయిల్, మాస్ స్టార్ట్ విభాగంలో రెండు బంగారు పతకాలు వచ్చాయి. అండర్-16 విభాగంలో స్వాతి కాంస్య పతకం సాధించింది. సైక్లింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యదర్శి భూలోకం విజయకాంత్ రావు వారిని అభినందించారు. జిల్లా సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు జీవీ కృపాకర్ రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, సూర్య ప్రకాష్, సురేందర్ హర్షం వ్యక్తం చేశారు.



నగరంలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు.. దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ (ఇన్‌సెట్‌లో..)



# ఘనంగా క్రిస్మస్

నిజామాబాద్ సిటీ: జిల్లాలో క్రిస్మస్ వేడుకలను సోమవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు మొదటి ఆరాధనతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం కాగా, భక్తులు చర్చి ఎదుట ఉన్న శిలువ వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ సీఎస్ఐ చర్చి, నిర్మలా హృదయ చర్చి, ఎల్లమ్మగుట్ట హోసన్నా చర్చి, సుభాష్‌నగర్ గ్లోరియస్ చర్చి, ముబారక్‌నగర్ జీఎల్ఎఫ్‌జీఎం చర్చి, వినాయక్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఎస్ఐలో ప్రెస్‌బీటర్ ఇన్‌చార్జి, రెవరెండ్ జార్జ్ దైవ సందేశం వినిపించారు. ఏసు క్రీస్తు మార్గంలో నడవాలని సూచించారు.



నిజామాబాద్‌లోని సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సీఎస్ఐ చర్చికి వస్తున్న క్రైస్తవులు



నిర్మల హృదయ చర్చిలో ప్రార్థనలు



సీఎస్ఐ చర్చిలో..









## కమీషన్ ఏజెంట్లదే హవా!

- బ్రోకర్ ద్వారా వెళ్తేనే రైతులను పట్టించుకుంటున్న బ్యాంక్ అధికారులు
- రూ.లక్ష క్రాప్ లోన్ రెన్యువల్‌కు రూ.3 వేలు వసూలు



సదాశివనగర్‌లోని యూనియన్ బ్యాంక్

సదాశివనగర్: సదాశివనగర్‌లోని యూనియన్ బ్యాంక్ కమీషన్ ఏజెంట్లకు అడ్డాగా మారింది. బ్యాంక్‌కు నేరుగా వెళ్లిన ఖాతాదారుడిని పట్టించుకోకుండా మధ్యవర్తులు, కమీషన్ ఏజెంట్లతో వెళ్తే సిబ్బంది పట్టించుకుంటున్నారు. ఏజెంట్లు, సిబ్బంది కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి సుమారు రూ.రెండు కోట్లకుపైగా స్వాహా చేసిన విషయం విదితమే. మరోవైపు బ్యాంక్‌లో మధ్యవర్తులకు ఇచ్చే మర్యాద రైతులకు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బ్రోకర్‌ను పట్టుకుని వెళ్తేనే బ్యాంక్ అధికారులు తమతో మాట్లాడుతున్నారని రైతులు వాపోతున్నారు. పంట రుణాలు రెన్యువల్ చేయాలంటే కూడా మధ్యవర్తులు లేనిది అధికారులు ఏ పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పంట రుణాల రెన్యువల్‌కు కూడా ఏజెంట్లు కమీషన్ వసూలు చేస్తున్నారు. ఇలా రూ.లక్ష లోన్ రెన్యువల్ చేస్తే రూ.మూడు వేలు తీసుకుంటున్నారు. బ్యాంక్ వద్ద కమీషన్ ఏజెంట్లదే హవా కనిపిస్తుంది. సదాశివనగర్, లింగంపల్లి, అమర్లబండ, ధర్మారావ్‌పేట్, మర్కల్, తిర్మన్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన కొందరు ఏజెంట్ల అవతారం ఎత్తి రైతులతో ఆడుకుంటున్నారు. రైతులు చేసేదేమి లేక తప్పని పరిస్థితుల్లో కమీషన్‌లను ఒప్పుకుని పంట రుణాలను రెన్యువల్ చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు ఏజెంట్ల ద్వారా బ్యాంక్ అధికారులకు విందులు సైతం ఏర్పాటు చేసిన ఘటనలు ఉన్నాయి. ఇట్టి విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని రైతులు వాపోతున్నారు. బ్యాంక్‌లో కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా రుణాలు ఇవ్వాలని, రెన్యువల్ చేయాలని రైతులు కోరుతున్నారు.

**చెక్‌బుక్‌ల కోసం రెండు నెలలు**

బ్యాంక్ చెక్‌బుక్‌ల కోసం దరఖాస్తు చేసుకొని రెండు నెలలైనా రావడం లేదని పలువురు ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెక్‌బుక్‌లు రావడం లేదని ఆరోపిస్తున్నారు. బ్యాంక్ అధికారులు ఖాతాదారుల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుండడంతో ఖాతాదారులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌బుక్ ఎప్పుడు వస్తదని అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని, ప్రశ్నిస్తే తమతో గొడవ పడుతున్నారని తిర్మన్‌పల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతు తెలిపారు.

## రాములోరి అక్షింతల శోభాయాత్ర



కమ్మర్‌పల్లిలో శ్రీరామ అక్షింతల కలశ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కమ్మర్‌పల్లి/బాల్కొండ: అయోధ్య శ్రీరాముడి అక్షింతల కలశ శోభాయాత్రను సోమవారం ఘనంగా నిర్వహించారు. బాల్కొండ, కమ్మర్‌పల్లి గ్రామాల్లో ప్రధాన వీధుల్లో సాగిన శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు, హిందూ ధార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బాల్కొండలో..

## బేస్‌బాల్ చాంపియన్‌గా జిల్లా బాలికలు



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు గెలుపొందింది. ఫైనల్‌లో ఆదిలాబాద్ జట్టుపై 08-02 తేడాతో గెలుపొంది టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీత్ రావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు బేస్‌బాల్ కిట్ అందజేస్తానన్నారు. జిల్లా జట్టుకు కోచ్, మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్, చిప్ప నవీన్, రాజేందర్, సంతోష్ వ్యవహరించారు.

**జాతీయ పోటీలకు ఎంపిక**

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సుద్దపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ఎం నిషిత, ఆర్ చైత్ర, కె శ్రీవాణి, ధర్మారం గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్ మహిత, అహల్య (ఆర్మూర్) ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఎం రాహుల్ (జిల్లా పరిషత్ హై స్కూల్ మిట్టపల్లి), రోహిత్ (సత్యశోధక్ పాఠశాల, సిరికొండ) ఎంపికయ్యారు.



కప్ అందుకుంటున్న బాల్‌బ్యాడ్మింటన్ జట్టు

**బాల్‌బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం..**

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో జిల్లా మహిళా జట్టుకు ద్వితీయ స్థానం లభించింది. ఈ నెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లోని బాలానగర్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల టోర్నమెంట్ జరిగింది. ఇందులో జిల్లా మహిళా జట్టు ద్వితీయ స్థానం సాధించి రన్నరప్ ట్రోఫీ అందుకుంది. క్రీడాకారులను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, ఎన్వి హనుమంత్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్ తదితరులు అభినందించారు.

## అ'పూర్వ' సమ్మేళనం



బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్ జెడ్పీ హైస్కూల్‌లో 1993–94లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రబ్బాని, దేవదాస్, మొగులయ్య, కృష్ణకుమారి, మతీన్, తుకారాం, అశోక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంజలి, రాము, సాయిలు, గంట చందు తదితరులు పాల్గొన్నారు.

## మృతులకు నివాళి



మాక్లూర్: ఇటీవల హత్యకు గురైన మాక్లూర్‌కు చెందిన మృతులకు గ్రామస్తులు సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ తీసి నివాళి అర్పించారు. గ్రామానికి చెందిన ప్రసాద్‌తోపాటు అతని భార్య సారిక, పిల్లలు చైత్రిక్, చైత్రిక, చెల్లెళ్లు హత్యకు గురైన విషయం తెలిసిందే. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని గ్రామస్తులు బాధితుల ఇంటి నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యూత్ నాయకుడు సాయికుమార్, నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సాహస క్రీడలతో మనోధైర్యం





సాహస క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎడపల్లి: సాహస క్రీడలు మనోధైర్యాన్ని కలిగిస్తాయని రోటరీ క్లబ్ నిజామాబాద్ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. నిజామాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రైలా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎడపల్లి మండలం అలీసాగర్‌లో సోమవారం అడ్వెంచర్స్ సొసైటీ కొల్ల రంగారావు గారి ఆధ్వర్యంలో సాహస క్రీడలు నిర్వహించారు. రాఫ్టింగ్, గుర్రపు స్వారీ తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఎన్ ప్రసన్నకుమారి, రైలా చైర్మన్ జితేంద్ర మలాని, విజయ రావ్, పవన్ పాండే, బాబు రావు, మారయ్యగౌడ్, సతీష్ షాహ, జ్ఞాన ప్రకాష్, ఎస్ఎస్ఆర్ ప్రిన్సిపాల్ భాస్కర్ పాల్గొన్నారు.

## ముసుగు తీయరూ!



బాల్కొండ: ఎన్నికల కోడ్ ముగిసినా ముప్కాల్ మండలం రెంజర్లలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు తొలిగించలేదు. ఎన్నికల కోడ్ సందర్భంగా గ్రామాల్లో నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. కోడ్ ముగిసి నెల రోజులు కావస్తున్నా ముసుగులు తొలగించలేదు.

# వాహనదారులకు భద్రతేదీ?

- పద్మాజీవాడి చౌరస్తా వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి పనులు
- రాకపోకలకు ఇబ్బందులు
- రోడ్డు పక్కన దిగబడుతున్న వాహనాలు



పద్మాజీవాడి చౌరస్తా వద్ద బ్రిడ్జి నిర్మాణం

సదాశివనగర్: మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. పనుల నేపథ్యంలో ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించారు. ఆ రోడ్లు వాహనాల రద్దీకి సరిపోక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా ఆ రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత లేని పనులు చేపట్టడంతో రోడ్డు పక్కన పోసిన మొరం దిగబడుతోంది. భారీ వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. మూడు రోజుల క్రితం నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు భారీ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన మట్టిలో దిగబడింది. దానిని తీయడానికి యత్నించగా ఇంకా మట్టి కూరుకు పోవడంతో పూర్తిగా రోడ్డుకిందికి పోయింది. అయినా సంబంధిత గుత్తేదారు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంకా లారీ అలాగే ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి పనుల సమీపంలో బోల్తా పడ్డ లారీ